

**రవీంద్రభారతి** నుండి బయటికి రాగానే ఎదురయింది మెరుపు తీగ.

నా కళ్ళలో మెరుపులు మెరిశాయి.

చాలా కాలంగా నేను మరిచిపోయిన చిరునవ్వు అప్రయత్నంగా పెదవుల మీద కదలాడింది.

"మాలతీ!" అన్నాను పలకరింపుగా.

"హమ్మయ్య! నిన్ను కలుసుకుంటానో, లేదోనని భయపడ్డాను." భవిష్యత్తును పూల పొన్నులాగ ఊహించుకుంటూ, వర్తమానాన్ని సుందరస్వప్నంగా గడుపుతున్న రోజులలో పరిచయమైన సెలయేటి గలగలలు తిరిగి ఇన్నాళ్ళకు విన్నట్టయింది.

అప్పటికీ, ఇప్పటికీ రూపంలో, స్వరంలో ఏ మాత్రం మార్పులేదు. అదే మాలతి!

"నిన్ను ఇలా చూస్తా ననుకోలేదు." మాలతి పక్కగా నడుస్తూ అన్నాను. ఆమె రాసుకొన్న ఇంటిమేట్ పరిమళం స్మృతుల తెరలను తొలగిస్తున్నట్లుగా ఉంది.

ఏదో ఉద్వేగం నిప్పు సెగలా నరనరాల్లో వ్యాపిస్తూ ఉంది. ఆ వేడికి ఇంతవరకూ నన్నావహించిన నిశ్శబ్దం, నిర్లిప్తం వెన్నలా కరుగుతున్నట్లు అనుభూతి.

"ఈ దినం రవీంద్రభారతిలో నీ ఉపన్యాసం ఉన్నట్లుగా ఒక గంట క్రిందటే తెలిసింది. వెంటనే వచ్చేశాను."

సెలయేటి గలగలలు సుమధురంగా నా శ్రవణేంద్రియాలను తాకుతున్నాయి.

"మకాం ఎక్కడ, శైలా?" ప్రశ్నించింది.

చెప్పాను.

"ఊహూ. అక్కడికి వద్దు. ఈ దినం నువ్వు నా గెస్ట్వి."

కాదనలేకపోయాను.

నన్ను ఆహ్వానించిన కార్యకర్తల దగ్గర సెలవు తీసుకుని బయటపడ్డాము.

మాలతిని చూడగానే కారు తలుపు తెరిచి వినయంగా నిలబడ్డాడు డ్రైవరు. అతణ్ని సిటీబస్‌లో ఇంటికి వెళ్ళమనిచెప్పి, స్టీరింగు ముందు కూర్చుంది.

"కమాన్, శైలా!" అంది నా వైపుచూస్తూ.

గతంలో లాగ మాలతి పక్కనే ఫ్రంట్‌సీటులో కూర్చోవడానికి సంశయించాను.

ఇప్పు డామె వివాహిత.

వేరొకరి భార్య.

వెనక సీట్లో కూర్చోవడానికిగాను కారు తలుపును తెరవబోతూంటే మాలతి వారించింది.

"ప్లీజ్! కమాన్, శైలా!," అంటూ ఫ్రంట్ డోర్ తెరిచింది. మౌనంగా వెళ్ళి కూర్చున్నాను.

కారు ముందుకు కదిలింది.

క్షణాలు, నిమిషాలు మౌనంగా మా మధ్య దొర్లిపోతున్నాయి.

'మాలతి నా సర్వస్వం' అనుకుంటూ రోజుల్ని క్షణాల్లాగ గడిపేస్తూ, బంగారు ఇసుక తిన్నెలపై ఊసులాడుకుంటూ, వెన్నెల వర్షంలో తడుస్తూ, భవిష్యత్తు గురించి ఎన్నెన్నో కలలు కన్న రోజులు స్మృతిపథంలో బరువుగా కదిలాయి.

భారంగా నిట్టూర్చాను.

మాలతి దృష్టి డ్రైవింగ్ మీదే నిమగ్నమై ఉంది. కారు టాంక్‌బండ్ మీదుగా పరుగులు తీస్తూ వుంది. గతం వైపు తొంగిచూసింది మనసు.

ప్రేమ కథలకు ముగింపు చాలా వరకు ఒకే విధంగా వుంటుంది. మనసులు కలవడానికి అడ్డుపడని అంతస్తులు–మనువు విషయంలో మాత్రం ఎదురు



# మరో ఇడియట్ కథ

-కశింకోట ప్రభాకర దేవ్

నిలుస్తూంటాయి. మా కథ కూడా సగటు ప్రేమ కథే అయింది.

మాలతి పెళ్ళి వాళ్ళ నాన్నగారి హోదాకు తగ్గట్టుగానే ఒక గొప్ప ఇంటి అబ్బాయితో జరిగిపోయింది. నేను సర్వస్వం అనుకున్న మాలతి శాశ్వతంగా వేరొకరి సొత్తు అయిపోయింది.

ప్రేమించిన నేరానికిగాను మాయని గాయం నా గుండెలో మిగిలిపోయింది. స్వప్నం తొణికింది.

కారు చిన్న కుదుపుతో ఆగటం వల్ల ఆలోచనల నుండి బయటపడ్డాను.

ఎదురుగుండా అందమైన బంగళా.

అంతస్తుకు, ఆ అంతస్తు తెచ్చి పెట్టిన అహంకారానికి కాపలా అన్నట్లుగా చుట్టూ ప్రహరీగోడ. డిజైన్ చెయ్యబడ్డ ఇనుపగేటు, ఆ గేటు దగ్గర యూనిఫారంలో కండలు తిరిగిన శరీరంతో ఒక గూర్ఖా.

కారును చూడగానే గూర్ఖా గేటు తెరిచాడు.

పోర్టికోలో కారు వుంచి బంగళాలోనికి నడిచాము.

పాము శరీరంలాగ మిసమిసలాడుతున్న మొజాయిక్ ఫ్లోరింగ్, ప్లాస్టరాఫ్ పారిస్‌తో రూఫింగ్, ఖరీదైన కార్పెట్లు, సోఫాసెట్లు, ఎయిర్ కూలర్స్ నుండి వస్తున్న ఖరీదైన గాలులు — ఆ ఇంట్లోని వారి వైభవాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

"మీ వారు లేరా?" నిశ్శబ్దంగా ఉన్న ఆ ఇంటిని పరికించి చూస్తూ అడిగాను.

లేరన్నట్లుగా తల ఆడించింది మాలతి.

"కట్టుకున్న భార్యకన్నా కంపెనీ షేర్లమీదే వారికి మక్కువ. వాటిని పెంచుకోవడంలో నెలకు పాతిక రోజులు క్యాంపుల్లోనే గడిపేస్తారు." వైవాహిక జీవితంలో ఏదో అసంతృప్తి మాలతి మాటల్లో అంతర్లీనంగా ధ్వనించింది.

డ్రాయింగ్ రూములోని సోఫాలో కూర్చోమని చెప్పి, లోపలి గదిలోకి వెళ్ళింది మాలతి.

సిగరెట్ తీసి వెలిగించుకున్నాను.

మాలతి తన భర్త గురించి చెప్పిన మాటలు నా చెవులో ఇంకా మార్మ్రోగుతున్నాయి.

నెల రోజుల క్రితం మాలతి గురించి నేను ఒక 'భాగ్యనగరం' మిత్రుడిద్వారా విన్న సంగతి గుర్తుకు వచ్చింది. అది నిజం కాదని మొదట అనుకున్నాను. కాని, ఇప్పుడు మాలతి చెప్పిన దానినిబట్టి నిజమేనేమో అనిపిస్తూ ఉంది.

'మాటల్లో అపశ్రుతి జీవితానికి దర్పణం కావచ్చు!' ఆలోచిస్తూ కూర్చున్నాను.

వేళ్ళమధ్య సిగరెట్టు క్షణక్షణానికి తరిగిపోతున్నది, మనిషి జీవితంలాగా.

దూరంగా ఎవరో 'ఆ సావేరి'ని వీణ మీద పలికిస్తున్నారు. ఆ రాగం మంచుకన్నా చల్లని హస్తాలతో గుండెను పిండుతున్నట్లుగా ఉంది. జత కోల్పోయిన జంట పావురం విషాదాలాపన మది.

"ఏదో సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లు ఉన్నావు" అంటూ గదిలోనికి వచ్చింది మాలతి.

ఆలోచనలు చెదిరిపోయాయి.

సగం కాలిన సిగరెట్టును ఏష్‌ట్రేలో నలిపి పడేశాను.

స్నానంచేసి వచ్చింది కాబోలు — పాలరాతివంటి శరీరం మీద నీటి బిందువులు ముత్యాల్లాగ అక్కడా అక్కడా మెరుస్తున్నాయి. తెల్లని టెరీ కాటన్ చీరలో, అదే రంగు బ్లవుజులో, మంచులో తడిసిన మల్లెపువ్వు లాగ వుంది మాలతి.

అదే మాటను అప్రయత్నంగా అన్నేశాను. నా మాటలకు హరివిల్లులోని సొగసులన్నీ ప్రస్ఫుటించే లాగ మనోహరంగా నవ్వింది.

"కవివి అనిపించుకున్నావు." నా ప్రశంసకు గర్వంతో నిండిన ఆనందరేఖ మాలతి వదనంలో తళుక్కుమంది. నా ఎదురుగా సోఫాలో కూర్చుని, పక్కనే ఉన్న స్విచ్ సుతారంగా నొక్కింది.

భవనంలోపల ఎక్కడో కాలింగ్‌బెల్ మోగిన శబ్దం. ఆ శబ్దం ఆగడం తరవాయి, వార్ధక్యంలోకి అడుగు బెట్టబోతూన్న వ్యక్తిలా ఉన్న స్త్రీ మేము ఉన్న గదిలోకి వచ్చింది.

వేషభాషలను చూసి వెంటనే చెప్పవచ్చు— ఆ వ్యక్తి ఖచ్చితంగా పనిమనిషి అని.

"ఆదెమ్మా! నా గదిలో బాటిల్ని, గ్లాసుల్ని పట్టుకు రా" అంది మాలతి.

ఉలిక్కిపడ్డాను.

నా చెవులు నన్ను మోసం చెయ్యలేదు కదా అనిపించింది.

ఆదెమ్మ తల ఊపి లోనికి వెళ్ళింది.

"బాటిల్ ఏమిటి?" ఆశ్చర్యంగా మాలతివైపు చూస్తూ ప్రశ్నించాను.

నా ప్రశ్న మాలతికి సిల్లీగా తోచింది కాబోలు—

"అదేమిటో రాబోతుందిగా? చూద్దువుగాని" అంది చిన్నగా నవ్వుతూ. నవ్వులో కవ్వింపు.

ఆ నవ్వులో ఇదివరకటి వెలుగుకాని, నిండుతనం కాని లేదు.

"నీ పెళ్ళికి పిలుస్తావని అనుకున్నాను. ప్చ్! నువ్వు పిలవలేదు. ఇంతకూ మీ ఆవిడ పేరేమిటో

తెలుసుకోవచ్చా?" టాపిక్ మార్చడానికి ప్రయత్ని స్తున్నట్లుగా వుంది మాలతి ధోరణి.

బరువుగా నిట్టూర్చాను.

"పెళ్ళిచేసుకున్నప్పుడు తప్పకుండా చెబుతాను."

'ఏమిటి?!నువ్వింకా పెళ్ళి చేసుకోలేదా, శైలూ?" మాలతి గొంతుకలో విస్మయం, కలవరపాటు తొంగి చూశాయి.

"గతాన్ని నావంటి వాళ్ళు అంత తేలికగా మరిచి పోయి, పరిస్థితులతో రాజీ పడలేరు, మాలతీ! అది బలహీనత కావచ్చు."

నా మాటలు మాలతి హృదయాన్ని సూటిగా తాకినట్లున్నాయి. ముఖంలో రంగులు మారాయి.

"అది బలహీనతకాదు, శైలూ! గొప్పదనం. పరిస్థితులకు లొంగిపోయి, వాటితో రాజీపడిపోయి, ప్రేమాభిమానాలను చంపుకోవడానికి వ్యర్థ ప్రయత్నం గావించేవాళ్ళే బలహీనులు. నేనా రకానికి చెందిన దాన్ని." మాలతి గొంతు బొంగురుపోయింది.

ఆదెమ్మ బాటిల్ని, గ్లాసుల్ని, ఐసు ఫ్లాస్కును, సోడాలను, కాష్యూనట్ ప్లేటును మా మధ్య టీపాయ్ మీద ఉంచింది.

"నువ్విక ఇంటికి వెళ్ళిపో, ఆదెమ్మా! నేను వడ్డించుకుంటానులే." చెప్పింది మాలతి.

ఆదెమ్మ నిష్క్రమించింది.

కొద్దిసేపు మా మధ్య మౌనం గంభీరంగా చోటుచేసుకుంది. ఆ నిశ్శబ్దాన్ని భరించలేక, అసహనంగా సోఫాలో కదిలింది మాలతి.

"జీవితం ఏ కథకుడూ ఊహించలేనంతగా అప్పుడప్పుడూ గొప్ప మలుపులు తిరుగుతూ ఉంటుంది. కనిపించే నిజాల ముందు కల్పనలు ఏపాటివి? నిన్నింత తొందరగా చూస్తాననుకోలేదు, శైలూ! ఈ దినం చాలా చాలా ఆనందంగా ఉంది. లెటజ్ సెలిబ్రేట్ ది అకేషన్! కమాన్."

మహా గాయకుడి స్వరంలో అపశ్రుతి పలికి నట్లుగా తోచింది మాలతి ధోరణి.

అనంతమైన భావాలను ఇముడ్చుకున్న మాలతి కళ్ళలోకి సూటిగా చూశాను.

"ఇదెప్పటినించి అలవాటు చేసుకున్నావు?" ప్రశ్నించాను.

"ఏం, చేసుకోకూడదా?" ఎదురు ప్రశ్న వేసింది మాలతి. కొన్ని క్షణాల తర్వాత —

"నీకు అలవాటే కదూ, శైలూ! అఫ్‌కోర్స్! మగవాడు తాగితే లోకం పట్టించుకోదు. ఆడది తాగితేమాత్రం వింతగా చూస్తుంది. ఏమై రైట్?" అంది.

రెండు గ్లాసుల్లోకి మందును సర్ది, సోడాతో నింపింది. ఒక గ్లాసును నాకు అందించింది.

కొద్ది నిమిషాలపాటు కాలం మా మధ్య చేదుగా, బరువుగా దొర్లిపోయింది.

సిగరెట్ వెలిగించుకున్నాను.

"ఒక విషయం అడుగుతాను. ఏమీ అనుకోవు కదూ?" నన్ను తొలిచేస్తున్న అనుమానాన్ని వ్యక్తం చెయ్యడానికి నాందీ ప్రస్తావనగా అడిగాను.

మాలతి భ్రుకుటి ముడిపడింది.

"నువ్వేమి అడిగినా, నేనేమీ అనుకోను" అంది మెల్లగా. గలగలపారే సెలయేరు గంభీర ముద్ర దాల్చినట్లు అనిపించింది.

"నీ గురించి ఏవేవో విన్నాను ..."

నా మాటలకు మాలతి నవ్వేసింది. ఆ నవ్వులో జీవంలేదు. కాగితం పువ్వు లాగ కృత్రిమంగా ఉంది.

"ఏవేవో విన్నానంటే—ఏమిటవి?!" స్వరంలో విశృంఖలత, తెగింపు లీలగా ధ్వనించాయి.

చెప్పడానికి సంకోచిస్తూ, మౌనం వహించాను.

నా మౌనంలో మాలతికి జవాబు దొరికి ఉండవచ్చు.

"బహుశా — నేను చెడిపోయానని నువ్వు విని ఉంటావు."

తల ఊపాను.

వేదాంతిలాగ నిట్టూర్చింది మాలతి. కళ్ళలో ఏదో నిశ్చలత్వం.

"మనసారా ప్రేమించిన వ్యక్తిని మరిచిపోయి ఇంకొక వ్యక్తితో మూడు ముళ్ళూ వేయించుకున్న నాడే మానసికంగా చెడిపోయాను. మానసికంగా చెడిపోయిన తరవాత శారీరకంగా చెడిపోవడం ఒక లెక్కలోది కానేకాదు."

"అగ్నిసాక్షిగా తాళికట్టిన భర్తను వంచించటం అన్యాయం." మాలతి వాదన నచ్చక అన్నాను.

విరక్తిగా నవ్వింది.

"ఆ ఆలోచన అవతలి వ్యక్తికీ ఉండాలి, శైలూ! తెలిసో, తెలియకో చేసిన ఒక పొరపాటును బలహీనతగా తీసుకుని ఎదుటి వ్యక్తి జీవితంమీదే దెబ్బ తీయడానికి ప్రయత్నించడం న్యాయమంటావా? ఆ పరిస్థితుల్లో ఎదురు తిరగడం తప్పంటావా?" కసిగా అంది.

మాలతి మాటలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ—

"నీకు, మీ వారికి మధ్య ఏమైనా గొడవలు వచ్చాయా? అఫ్‌కోర్స్! చెప్పడానికి నీకు అభ్యంతరం లేదనుకుంటాను" అన్నాను.

తల పంకించింది మాలతి.

"ఆ ఇడియట్‌కు నాతో గొడవ పడడానికి ధైర్య మెక్కడిది?" కసిగా అంది మాలతి.

అదిరిపోయాను. మాలతి నాకు తెలిసినంత వరకూ ఎవర్నీ దూషించడం ఎరుగను. అది ఆమె స్వభావానికే విరుద్ధమని నా నమ్మకం. అటువంటిది ఇప్పుడిలా మొగుణ్ణి ఇడియట్ అన్నదంటే వాళ్ళ ఇద్దరి మధ్య సంబంధం చాలావరకూ బెడిసి పోయి ఉండవచ్చు.

నాలో మరొక అనుమానం నిప్పుశెగలా కదిలింది.

"మన సంగతి—అంటే కాలేజీలో చదువు కొంటున్నప్పుడు నలుగురూ మన గురించి చెప్పుకొనే మాటలు మీవారికి తెలిశాయా?"

"తెలియడ మేమిటి? నా మెడలో ఈ లైసెన్సు బిళ్ళను కట్టకముందే—కట్టుకునే వాడి దగ్గర ఏదీ దాచకూడదని మన సంగతి నేనే చెప్పేశాను. దాన్ని అతడు చాలా తేలికగా తీసుకున్నాడు. కాలేజీ రోజుల్లో ఇటువంటివి జరగడం మామూలే నని పెద్ద సంస్కారవంతుడులా లెక్చరు ఇచ్చాడు. ఆ తరవాత మూడుముళ్ళూ నా మెడకు బిగించిన తరవాత తెలిసింది—మా వారొక రోగ్ అని. సంస్కారం ముసుగులో స్వార్థాన్ని దాచుకున్నాడు."

ఎక్కువగా మాట్లాడ్డంవల్ల ఆయాసంతో అధరాలు వణుకుతున్నాయి. కళ్ళలో అరుణారుణ రేఖలు.

"ఇంతకూ ఏం జరిగింది?"

"మా నాన్నకు గల పలుకుబడితో, నా వెనక కల ఆస్తితో తన అంతస్తును పెంచుకున్నాడు. లైసెన్సులు సంపాదించుకున్నాడు. వ్యాపారాన్ని వృద్ధి చేసుకున్నాడు. ఇది తప్పు అని నేను అనను. కాని, ఆ రోగ్ ఒకసారి చిత్తుగా తాగేసి వచ్చి, నేను చెడిపోయానంటూ నానాకూతలూ కూశాడు. అప్పుడే తెలిసింది—నన్నా రోగ్ ఎందుకు పెళ్ళి చేసుకున్నది. అప్పుడే నా గుండె బద్దలయింది. నేనెంత అందంగా మోసపోయానో గ్రహించాను. నన్నంత హీనంగా చూస్తూ, పరపతిని పెంచుకుంటున్న వ్యక్తిమీద కసితో, నేనిలాగ ఎదురు తిరగటం మొదలు పెట్టాను. నన్ను ఆయన ఏం చెయ్య లేడు. నలుగురూ ఆయన్ను చూసి నవ్వుకుంటున్నా, అతడు నన్నేమీ ధైర్యంగా అనలేడు. అలాగ అన్న క్షణంలో అతడి అంతస్తులన్నీ నేల కూలిపోతాయి. ఆ నయవంచకుణ్ణి నలుగురూ 'పీడి భార్య ఒక పెద్ద తిరుగుబోతు!' అంటూ హేళన చెయ్యాలి. అప్పుడే నా కసి తీరాలి." పగ బట్టిన పాములాగ బుసకొట్టుతున్న ధ్వని వినిపించింది మాలతి నిట్టూర్పుల్లో.

మాలతి చెప్పడం ముగించి ఖాళీ అయిన గ్లాసుల్ని తిరిగి సీరియస్‌గా నింపింది. ★



## ఉపాయం

ఒక కోటీశ్వరుడు చచ్చి స్వర్గానికి వెళ్ళాడు. అతను చేసిన పుణ్య కార్యాలు ఏమిటా అనే చర్చ వచ్చింది. అడగ్గా "చనిపోవడానికి ముందు రోజున ఒక బిచ్చగాడికి మూడు పైసలు దానం చేశా" నన్నాడు ఆ పుణ్య పురుషుడు.

"ఇంకేమైనా మంచి పనులు చేశావా? గుర్తు చేసుకో." అడిగాడు వాడు.

"లేదు" అన్నాడు ఖచ్చితంగా

"మూడు పైసల దానంతో నువ్వు స్వర్గానికి రావడం అసంభవం" అన్నాడు స్వర్గ దేవత.

"అయితే, ఏం చేద్దాం" అని చర్చించుకున్నారు దూతలు.

"అతను దానం చేసిన మూడు పైసలు తిరిగి ఇచ్చివేసి నరకంలో తోద్దాం పట్టండి" అన్నాడు మరొక దూత తెలివిగా.